తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) 1988 ఉగాది మినీ కథల పోటీలో రు.150 లు గెలుపొందిన కథ



# రెండు లోకాల పిట్ట

మధు ఎస్.పి

హాలంతా చీకటిగా నిశ్శబ్దంగా వుంది. అందరితో పాటు చిట్టిబాబు, చిట్టిబాబు భార్య రూప సినిమాలో లీనమైపోయారు. ఇంతలో రూప ఒడిలోని సంవత్సరం వయసుగల పాప ఏడవడం మొదలుపెట్టింది. ఏడుస్తున్న పాపకి పాలు పట్ట బోయింది రూప. పాప తాగలేదు, అలాగే ఏడవ సాగింది.

ముందు వరసలోని కొందరు ఒక్క క్షణం మెడలు తిప్పి మరల అటు తిరిగి సినిమా చూడసాగారు. చిట్టిబాబు తన కూలింగ్ గ్లాస్ పెట్టుకొనే కేస్ పాప చేతికిచ్చాడు. పాప ఏడుపు మాని దానితో ఆడుకో సాగింది. ఓ పది నిమిషాల తరువాత రూప కిందకి వంగి ఏదో వెదకడం చూసి "ఏంటి వెదుకుతున్నావ్" అని అడిగాడు.

"మీ అద్దాల కేస్ పాప కిందపడేసినట్టు వుంది" అంది రూప.

"దొరికిందా."

"లేదండి. సీటు కింద లేదు" అంది రూప వెతుకుతూనే.

"ఎటువైపు పడేసిందో గమనించావా" అడిగాడు చిట్టిబాబు.

"లేదు. సర్లేండి ఇంటర్వెల్‌లో లైట్ వేసినప్పుడు చూద్దాం"

"నీ కసలు బుద్ధిలేదే. ఎటు పడేసిందో గమనించ వద్దా" అన్నాడు కోపంగా.

"బాగుందండీ. అది పడేస్తుందని నేను కలగన్నానా" అంది విసుగ్గా.

"నీకు సినిమా వుంటే చాలు. ఇంకేం పట్టదు, దున్నపోతా."

"ఏంటా మాటలు ఎవరన్నా వింటారని లేకుండా."

"ఏం వింటే ! పౌరుషానికి ఏం తక్కువ లేదు దరిద్రపుదానికి" చిట్టిబాబు కోపంగా.

"ఎందుకంత రాద్ధాంతం చేస్తారు - వుత్త కేసేగా, అద్దాలైతే కాదుగా" అంది రూప.

"కేస్ గురించి కాదు, జాగ్రత్త గురించి. నీ ఒడిలోంచి పాప జారిపోయినా పట్టించుకోవు. సినిమా మీదంత మోజు తమరికి!" ఇంటర్వెల్‌లో డిమ్‌లైట్ల కారణంగా మసక వెలుతురులో పక్కసీట్ల కింద, ముందు, వెనక వరస సీట్ల కింద వెదికారు, దొరకలేదు.

"అది ఎవడి కాలికింద పడి విరిగిపోయిందో, జనాలు నడిచేప్పుడు కాళ్ళకి తగిలి ఏ మూలకి పడ్డదో లేదా ఎవడైనా జేబులో పెట్టుకున్నాడో" అంటూ సినిమా అయినదాకా రుసరుసలాడుతూ వున్నాడు చిట్టిబాబు.

ముచ్చటపడి బలవంతాన మొగుడ్ని సినిమాకు తెచ్చి నందుకు బాగానే శాస్తి జరిగిందనుకుంటూ సినిమా చూడసాగింది రూప. సినిమా అయ్యాక లైట్లు వెలిగాక పాప కోసం పాల సీసా - ఎక్స్‌ట్రా డ్రాయర్లు పెట్టుకొని వచ్చిన బాగ్‌లో సురక్షితంగా కేస్ కనబడింది.

* * *

సినిమా అయ్యాక స్కూటర్ మీద ఇంటికి బయలు దేరారు. దారిలో చిట్టిబాబు స్కూటర్ ముందున్న మోటారు సైకిల్ వాడు సడన్‌గా ఎడమవైపు తిరిగాడు. ఇండికేట్ చెయ్యకుండా అలా తిప్పేసరికి, అది వూహిం చని చిట్టిబాబు సడన్ బ్రేక్ వేయడం, బ్యాలన్స్ తప్పి స్కూటర్ రోడ్డు దిగి అక్కడ ఒక రాయికి గుద్దుకొని పడిపోవడం వెనువెంటనే జరిగిపోయాయి. నలుగురు చేరి వీరికి సహాయం చేసి బండిని నిలబెట్టారు. ఇద్దరికీ పెద్దగా దెబ్బలు తగల్లేదు. స్కూటర్ ముందు భాగం సొట్టలు పడింది. అదృష్టవశాత్తు రోడ్డు పక్కగా ఇల్లు కడుతూ వుండడంవలన, అక్కడ ఇసుక వున్నందువల్ల ఆ ఇసుకలో ఎగిరిపడిన పాపకీ దెబ్బలు తగల్లేదు.

"ఏంటండీ ఇలా పడేశారు. కాస్త చూసుకొని నడ పొద్దటండీ. పాపకి దెబ్బలు తగల్లేదు కాబట్టి సరి పోయింది. బండి చూడండి ఎలా అయిపోయిందో" అంది రూప చిట్టిబాబుతో.

"సర్లే నోర్ముయ్యి. వీళ్ళందరూ నీ మాటలు విని నేను కావాలని పడేశానని అనుకోగలరు. వాడు అలా తిరుగుతాడని, నేను పడిపోతానని కలగన్నానా. లేదా ఇలా పడేసి స్కూటర్ పాడుచేసుకోవడం నాకిష్టమా! అను కోకుండా జరిగినదానికి నన్నంటావేం" అంటూ ఎగిరి పడసాగాడు చిట్టిబాబు. *